క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.75 వేల చెక్కు అందజేత



అచ్చంపేట: స్థానిక బ్లూబెల్స్ హైస్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం సేకరించిన రూ.75వేలు చెక్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి శుక్రవారం పాఠశాల డైరెక్టర్ నిర్మలాజ్యోతి, హెచ్‌ఎం శ్రీలత అందజేశారు. ఈ మొత్తాన్ని విజయవాడ వరద బాధితులకు అందజేసేందుకు వినియోగించవలసినదిగా కోరినట్లు హెచ్‌ఎం శ్రీలత తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ద్వారా తాము ముఖ్యమంత్రిని కలసి చెక్ అందజేశామన్నారు.

బెల్లంకొండ ఎస్‌ఐగా ప్రవీణ్ బాధ్యతలు



బెల్లంకొండ: స్థానిక పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్‌ఐగా డి.ప్రవీణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరి ట్రాఫిక్ ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తూ, బదిలీపై ఆయన బెల్లంకొండ స్టేషన్‌కు వచ్చారు. బెల్లంకొండ ఎస్‌ఐగా గత నెలలో బాధ్యతలు చేపట్టిన రాజానాయక్ పదిరోజుల క్రితం బదిలీపై సీఐడీకి వెళ్లారు. నూతన ఎస్‌ఐ ప్రవీణ్ గతంలో మేడికొండూరు, లాలాపేట, అరండల్‌పేట, నల్లపాడు స్టేషన్‌లలో పనిచేశారు. మండలంలోని గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ మద్యం రవాణా, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మండల ప్రజలందరూ సహకరించాలని కోరారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



బెల్లంకొండ: మండలం కేంద్రంలో శనివారం అయ్యప్ప మాలధారణ స్వాముల గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఏటా బెల్లంకొండ క్రాస్‌రోడ్డులోని కోళ్లూరి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఉన్న అయ్యప్ప విగ్రహాన్ని బెల్లంకొండ స్వాములు ఊరేగింపుగా తీసుకువచ్చారు. మేళతాళాల నడుము స్వామి వారిని తీసుకువచ్చి, మార్గ మధ్యలో నాగిరెడ్డిపాలెం కాలువలో స్వామి వారికి చక్రస్నాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాలధారణ చేసిన భక్తులు జల బిందెలతో ఊరేగింపుగా స్వామి వారిని బెల్లంకొండకు తీసుకువచ్చారు. మండల కాలం మాలధారులు పూజలు నిర్వహించేందుకు స్వామి వారిని స్థానిక శివాలయంలో ఉంచారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు కుందుర్తి బాల వీరాంజనేయులు, మద్దు రామాంజనేయులు, బద్దూరి పిచ్చిరెడ్డి, వజ్రాల శ్రీనివాసరెడ్డి, గంగిరెడ్డి ప్రతాపరెడ్డి, లక్ష్మారెడ్డి స్వాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పిడుగురాళ్ల: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన పట్టణంలోని ఖలీల్ దాబా వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఖలీల్ దాబా వద్ద పిడుగురాళ్ల వైపు నుంచి చిన గార్లపాడు గ్రామానికి బిళ్ల కోటేశ్వరరావు, బత్తుల లింగాలు, చల్ల నాగరాజులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా హైదరాబాద్ నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొనటంతో ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం నర్సరావుపేటకు తరలించినట్లు ఎస్‌ఐ మోహన్ తెలిపారు.

ఇన్‌చార్జి ఈఓపీఆర్డీగా కసిన్యా నాయక్

కారెంపూడి: కారెంపూడి ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ (ఎఫ్ఏసీ)గా కారెంపూడి పంచాయతీ కార్యదర్శి కె.కసిన్యానాయక్‌ను నియమిస్తూ ఎంపీడీఓ శనివారం ఉత్తర్వులిచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఈఓపీఆర్డీ పీహెచ్ సత్యప్రసాద్ దుర్గి ఈఓపీఆర్డీగా బదిలీ కావడంతో కసిన్యానాయక్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

అప్పుల బాధతో ఆత్మహత్య


శావల్యాపురం: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ఇర్లపాడు గ్రామంలో శనివారం జరిగింది. ఎస్సై లోకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మందా భూషణం (50) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పజెప్పారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

24x7 కిక్కే కిక్కు..!

పల్లెల్లో వీధి వీధికి.. మద్యం నిషా

ఒక మద్యం దుకాణం పరిధిలో ఐదు బెల్ట్ షాపులు

- ఒక్కో బెల్ట్ దుకాణానికి 'నేతల' లైసెన్స్ ఫీజు వసూలు
- సెంటర్‌ను బట్టి.. రేటు ఫిక్స్
- షాపుల క్లోజ్ అయితే.. క్వార్టర్ రూ.50 అదనం
- రోజంతా మద్యం లభ్యంతో మందుబాబుల చిందులు



పెదకూరపాడు: నూతన మద్యం పాలసీ అమల్లోకి రావడంతో.. మద్యం దుకాణాలతో పాటు.. బెల్ట్ షాపులూ ఊపందుకున్నాయి. గత ప్రభుత్వంలో మద్యం ప్రవాహానికి అడ్డుకట్ట పడితే.. కూటమి ప్రభుత్వం మద్యాన్ని ఏరులై పారించి పల్లెలను ముంచెత్తుతోంది. ఒక మద్యం దుకాణం పరిధిలో ఐదు బెల్ట్ షాపుల లెక్కన కూటమి చోటా నేతలకు కట్టబెడుతున్నారు. పైగా సెంటర్‌ని బట్టి.. బెల్ట్‌షాపునకు ఇంతని రేటు కట్టి మరీ నిర్వహణకు డబ్బులు వసూలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఉన్న దుకాణాల కన్నా.. అధికంగా దుకాణాలు పెంచి పల్లె విధుల్లో కిక్కును చేరువ చేసింది కూటమి ప్రభుత్వం. లైసెన్స్ పొందిన దుకాణాల యజమానులు.. దుకాణానికి ఐదుకు పైగా బెల్టు షాపులకు అనాధికార అనుమతులు ఇచ్చి, ప్రతి వీధిలో మద్యాన్ని అందుబాటులోకి తెచ్చారు.

మత్తులో పల్లెలు

పెదకూరపాడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 10 దుకాణాలు, క్రోసూరు పరిధిలో 10 దుకాణాలున్నాయి. దాదాపుగా కూటమి ప్రభుత్వం అనుకూలంగా ఉన్న వారికే దుకాణాలు దక్కాయి. దీంతో పల్లెలో కూటమి నేతలు బేరసారాలతో దుకాణాల్లో తమ వంతు పాత్ర పోషించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. దీంతో స్థానిక నేతల ఒత్తిడి మేరకు మద్యం దుకాణాల్లో వారికి అనుకూలంగా ఉన్న వారినే పెట్టుకున్నారు. అధిక లాభాలు పొందేందుకు దుకాణాలు పొందిన లైసెన్స్ దారులు స్థానికుల ఒత్తిడి మేరకు బెల్టు షాపులకు తెరలేపారు.

దుకాణానికి ఐదుకు పైగా బెల్టుషాపులు

పెదకూరపాడు నియోజకవర్గంలో 20 మద్యం దుకాణాల్లో ప్రతి దుకాణానికి ఐదుకు పైగా బెల్టు షాపులు అనాధికారంగా కూటమి నేతలు కట్టబెట్టారు. బెల్టు దుకాణానికి సెంటర్ కెపాసిటీని బట్టి రూ.లక్ష, రూ. 50 వేలు వరకు తీసుకోని వారికి బెల్టు షాపులు కేటాయిస్తున్నట్లు తెలిసింది.

సమయం దాటితే క్వార్టర్‌కు రూ.50 అదనం

లైసెన్స్ దుకాణం సమయ పాలన ప్రకారం మూసివేస్తే క్వార్టర్‌కు అదనంగా రూ.50లు అదనంగా తీసుకొని బె బెల్ట్ షాపుల్లో మద్యం అందుబాటులో ఉంచారు. నియోజకవర్గ వ్యాప్తంగా మండల కేంద్రాల్లో ఐదుకు పైగా బెల్టు షాపులు, గ్రామాల్లో ఒక్కటి లేదా రెండు దుకాణాలు ఉండేలా ఒప్పందం చేసుకున్నారు. మద్యం రేట్లు తగ్గిస్తామని చెప్పినా కూటమి నేతలు పాత రెట్లుకే, ఎక్కువ భాగం పాత బ్రాండ్లులనే అమ్మకాలు జరుపుతున్నారు. దీంతో మందుబాటులు రెట్లు తగ్గింపుపై చర్చించుకుంటున్నారు.

పీఎం సూర్య ఘర్‌తో పేద కుటుంబాలకు ఉపయోగం

పెదకూరపాడు: పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు విద్యుత్ బిల్లులు ఆదాతో పాటు అదనపు ఆదాయం వస్తుందని సీఆర్‌డీఏ విద్యుత్ నోడల్ ఆఫీసర్, బాపట్ల సర్కిల్ విద్యుత్ శాఖ ఈఈ తులసీరాం అన్నారు. పెదకూరపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఏఈ దాసరి రామకృష్ణ ఆధ్వర్యంలో పీఎం సూర్య ఘర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తులసీరాం మాట్లాడుతూ నెలసరి విద్యుత్ వినియోగం 0–150 యూనిట్లు కు సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ 1.2కిలో వీట్స్‌కి సబ్సిడీ రూ.30వేలు నుంచి 60 వేలు, 150–300 నెలవారి విద్యుత్ వినియోగదారులకు 2.3 కిలో వాట్స్‌కి రూ.60 వేలు నుంచి రూ.78వేలు వరకు సబ్సిడి ఇస్తారన్నారు.

రేపు ప్రజా దర్బార్

అచ్చంపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరవుతారని చెప్పారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు విధిగా హాజరు కావలసినదిగా ఆయన కోరారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎమ్మెల్సీ గెలుపుతో విజయ బాటలు వేద్దాం

వైఎస్సార్ సీపీ నేత పూనూరి గౌతమ్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత పూనూరి గౌతమ్‌రెడ్డి

నకరికల్లు: ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం గెలుపుతో వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలకాలని వైఎస్సార్ సీపీ నేత పూనూరి గౌతమ్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అధ్యక్షతన నకరికల్లు, రాజుపాలెం మండలాల కార్యకర్తలతో స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజానీకానికి సంక్షేమ పథకాల ఫలాలు అందాలంటే వైఎస్సార్ సీపీతో హయాంలో మాత్రమే సాధ్యమైందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వ అసమర్థత 100 రోజుల్లోపే తేటతెల్లమైందన్నారు. ఉద్యోగస్తులు, కార్మికులు, అంగన్‌వాడీలు, సామాన్య ప్రజానీకం ప్రభుత్వ పాలనపై విసుగెత్తిపోయారన్నారు. విశాఖలో కార్మికులు చేస్తున్న సమ్మె బయట ప్రపంచానికి తెలియకుండా ఉండేందుకు పవిత్ర తిరుపతి లడ్డూ ప్రసాదం అపవిత్రమైందని దుర్మార్గపు ప్రచారం సృష్టించి ప్రజలను మోసం చేశారని అన్నారు. వాస్తవాలు మాట్లాడిన వారి గొంతు నొక్కే విధంగా కేసులు బనాయించడం, ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడం, ప్రజా ఉద్యమాలు బయటకు రాకుండా తప్పుడు ప్రచారాలు లేవనెత్తడం టీడీపీ చేసిందేమీ లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలిపించుకొని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని గౌతమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈసారి అధికారంలోకి వచ్చాక ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందిండంలో స్థానిక కార్యకర్తలు, నాయకులకు ప్రాధాన్యతనిస్తామని సాక్షాత్తు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పినట్లుగా తెలిపారు. ప్రతి గ్రామంలోను 50 నుంచి 100 కొత్త ఓట్లు నమోదయ్యేలా కృషి చేయాలన్నారు. కొత్తగా ఓటుహక్కు నమోదు చేసుకునేవారికి లీగల్‌సెల్ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాజుపాలెం మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బిబాషా, మండల కో ఆప్షన్ సభ్యుడు డాక్టర్ షేక్.హుస్సేన్, వంగా రాజారెడ్డి, రెండు మండలాల్లోని గ్రామాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ సెంటర్‌లో వీవోఏల నిరసన

క్రోసూరు: మండలంలోని వీవోఏల అక్రమ రాజకీయ తొలగింపునకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా నాయకులు జి.రవిబాబు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు పరిపాటిగా మారిందని , గ్రామాల్లోని అవకాశవాద రాజకీయ పెత్తనాల కోసం చిన్న చిన్న ఉద్యోగస్తులను బలి పశువులను చేస్తున్నారని అన్నారు. ఇలాంటి అవకాశవాద విధానాలను చిరుద్యోగులపై నియోజకవర్గం మొత్తం టీడీపీ కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఏ వ్యక్తి అయినా ఒక పనికి అలవాటు పడిన తర్వాత అతనిని ఆ విధుల నుంచి తొలగించడం అంటే, అతని జీవితాన్ని ప్రభావితం చేయడమే నన్నారు. ఇలాంటి అవకాశవాద విధానాలను ప్రజలు ఖండించి , తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి రాకముందు రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పడం అంటే ఇలాగేనా అని ప్రశ్నించారు . వీవోఏ ల ఆందోళనను గుర్తించి, వారిని విధుల్లోకి తీసుకొని సమస్య పరిష్కరించాలన్నారు. లేకుంటే నియోజకవర్గం స్థాయిలో ఈ రకంగా రాజకీయ వేధింపులకు గురైనటువంటి వీవోఏ లు మొత్తాన్ని సమీకరించి త్వరలో ఆందోళన చేపడుతామని అన్నారు. కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి.హనుమంతరావు, వీవోఏలు పాల్గొన్నారు .

మహిళలు సమాజంలో గౌరవంగా బతకాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం, డీబీఆర్‌సీ కో–ఆర్డినేటర్

రాజుపాలెం: మహిళలకు అనేకమైన చట్టాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకుని ధైర్యంగా సమాజంలో గౌరవంగా బతికే అవకాశం తెలుసుకోవాలని ఏపీఎం శివకుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు రక్షణ చట్టాలపై అవగాహన సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఏపీఎం శివకుమార్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు దూసుకుపోతున్నారని తెలిపారు. ప్రతి మహిళ డ్వాక్రా గ్రూపులలో ఉండి పొదుపు కట్టుకుని శ్రీనిధి ద్వారా తీసుకున్న నిధులతో జీవనోపాధి పొందవచ్చన్నారు. డీబీఆర్‌సీ ఏరియా కో–ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. మండల మహిళా అధ్యక్షురాలు కాసంబి, సీసీ కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్ల తొలగింపుపై హైకోర్టు స్టే

తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఉత్తర్వులు

బెల్లంకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరునాడే బెల్లంకొండ మండలంలోని పలు గ్రామాలకు చెందిన యానిమేటర్లను విధుల నుంచి తొలగించారు. అనంతరం మండలంలోని 7 గ్రామాల్లో కొత్త యానిమేటర్లను నియమించాలంటూ జూలై 31న స్థానిక టీడీపీ నాయకులు సూచనల మేరకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కార్యాలయం నుంచి సిఫారసు లేఖను సంబంధిత అధికారులకు పంపారు. దీంతో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమను అకారణంగా విధుల నుంచి తొలగించడం అన్యాయం అంటూ వారు హైకోర్టుకు వెళ్లారు. మండలంలోని చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన చింతల వెంకటలక్ష్మి, వన్నాయపాలెం గ్రామానికి చెందిన గడ్డం శ్రీలేఖ, చంద్రాజుపాలేనికి చెందిన చిలకా రమాదేవి, నందిరాజుపాలెం గ్రామానికి చెందిన నామాల లక్ష్మీ అనే నలురుగు యానిమేటర్లు ఈ నెల 7న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వారి పిటిషన్ పరిశీలించిన న్యాయస్థానం వారి తొలగింపుపై స్టే విధించింది. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ డీఆర్‌డీఏ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. కాగా హైకోర్టు ఉత్తర్వులతో యానిమేటర్లు శుక్రవారం మండల డీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లారు. ఏపీఎం ఉషశ్రీని కలసి కోర్టు ఉత్తర్వులను అందజేశారు. తమను విధుల్లో తీసుకోవాలని యానిమేటర్లు ఆమెను కోరారు. కాగా యానిమేటర్లను తొలగించడం, విధుల్లోకి తీసుకోవడం తమ బాధ్యత కాదని, పూర్తిగా గ్రామ సంఘాల వీఓలకే ఆ అధికారం ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో వీఓల తీర్మానంతో తొలగించడం, విధుల్లోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో మాట్లాడుకుని విధుల్లో చేరాలంటూ కోర్టు ఉత్తర్వులను తీసుకోలేదు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం తమను విధుల్లోకి చేర్చుకోకపోతే, కోర్టు ధిక్కారం చేస్తున్నారని, తిరిగి కోర్టుకు వెళతామని యానిమేటర్లు తెలిపారు.


పరిసరాలు పరిశుభ్రత ఆరోగ్యానికి భద్రత

మలేరియా జోనల్ అడిషనల్ డైరెక్టర్ వీరరాజు



దొడ్లేరు(క్రోసూరు): పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం చేకూరుతుందని మలేరియా అడిషనల్ డైరెక్టర్ జి.వీరరాజు అన్నారు. శనివారం ఆయన మండలంలోని దొడ్లేరు, అచ్చంపేట మండలం నిండుజర్ల గ్రామాలను సందర్శించి గ్రామాల్లో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలను పరిశీలించారు. ఆయన వెంట వచ్చిన బృందం ఎంటమాలాజికల్ సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి వస్తువుల్లో, తొట్లల్లో దోమ లార్వాను పరిశీలించారు. దోమతెరలు వాడాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. రెండు, మూడు రోజులకి మించి జ్వరం వస్తే సమీపంలోని ఆరోగ్య, ఆశ కార్యకర్తలను సంప్రదించాలన్నారు. దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి వాటిని నిర్వీర్యం చేయడం ద్వారా దోమ కాటు ద్వారా సంభవించే వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులను అరికట్టవచ్చన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం డ్రైడే విధిగా పాటించాలన్నారు. అనంతరం ఆయన ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి వంట గదిని పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం టి.సామ్రాజ్యం, ఉపాధ్యాయులు టి.సదాశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య కార్యకర్త వద్ద వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్, ఫ్రైడే – డ్రై డే యాప్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, సత్తెనపల్లి రూరల్ సబ్ యూనిట్ అధికారి ఎంఎస్.బేగ్, గుంటూరు జోనల్ మలేరియా కార్యాలయ సబ్ యూనిట్ అధికారి కోడెల శ్రీను, హెల్త్ ఎడ్యుకేటర్ పార్వతి, హెల్త్ సూపర్వైజర్ శివుడు, ఆరోగ్య కార్యకర్త కోటేశ్వరమ్మ ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా టపాసులు విక్రయించొద్దు



దాచేపల్లి: అనుమతులు లేకుండా టపాసులు విక్రయించవద్దని తహసీల్దార్ వైపీ కుటుంబరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో టపాసుల వ్యాపారులతో సమావేశం శనివారం జరిగింది. నివాస గృహాలకు దూరంగా టపాసు విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రమాదవశాత్తు ప్రమాదాలు జరిగితే తక్షణ చర్యలు తీసుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సూచించారు. అధిక రేట్లకు టపాసులు విక్రయించవద్దని ఆయన చెప్పారు.

డాక్టర్ కొండవీడు ఇఎన్‌టీలో అత్యాధునిక వైద్య సదుపాయాలు

నరసరావుపేట: రాష్ట్రంలో ఆంప్లిఫాస్, న్యూరో ఈక్విలిబియం ఒకేచోట కల్గిన ఏకైక హాస్పిటల్ కొండవీడు ఇఎన్‌టీ హాస్పిటల్ అని మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి, పలువురు డాక్టర్లు కొనియాడారు. శనివారం రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో నిర్వహిస్తున్న కొండవీడు ఇఎన్‌టీ హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన కొండవీడు రిహాబిలిటేషన్ సెంటర్ ఫర్ స్పీచ్ అండ్ హియరింగ్ డిజార్డర్స్ ఆంప్లిఫాస్, న్యూరో ఈక్విలిబియమ్ కొండవీడు వర్టిగో డయా గ్నస్టిక్ సెంటర్‌ను స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సీనియర్ వైద్యులు డాక్టర్ మద్రిపెద్దయ్య, డాక్టర్ దత్తుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ల్యాబ్‌లను సందర్శించి తమ విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈసదావకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరా రు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నాగోతు ప్రకాష్, డాక్టర్ పాలూరి శ్రీనివాసరెడ్డి, ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ ఏఏవీ రామ లింగారెడ్డి, సీనియర్ డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ అధ్యక్షులు కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రాంప్రసాదు, డాక్టర్ కంజుల శ్రీవర్షిణి, మేనేజింగ్ డైరక్టర్ కంజుల కోటిరెడ్డి, సీఇవో మస్తాన్‌రెడ్డి, మేనేజర్ మహేష్, మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, పట్టణంలోని పలువురు డాక్టర్లు హాజరయ్యారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వెంకటనారాయణ

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): రైతులు, కౌలు రైతులు పంటల మార్పిడి విధానంపై అవగాహన చేసుకొని అధిక దిగుబడి వచ్చే పంటలను సాగు చేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఇన్‌చార్జి ఏపీడీ పొత్తూరి వెంకటనారాయణ చెప్పారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు, ప్రభుత్వ అధికారులతో అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటనారాయణ మాట్లాడుతూ రైతులకు, కౌలు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని పంటల దిగుబడి ఎక్కువ వచ్చే విధంగా సాగు చేపట్టాలన్నారు. దళిత, గిరిజనులకు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి చట్టం వచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పరచుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకొని, దళిత గిరిజనుల ఆత్మగౌరవం కాపాడుకోవడానికి భారత రాజ్యాంగం పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఆర్సీ సెంటర్ రీజినల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, ఏరియా కో–ఆర్డినేటర్ మేడె వెంకటరమణ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ చిలక హరిత తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన తాగునీరు అందించాలి

అమరావతి: మండలంలో పరిశుభ్రమైన తాగునీటిని ప్రజలకు అందించడంపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని, అలాగే గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో డయేరియా విజృంభిస్తోందని మండలంలో ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పట్ల శ్రద్ధ వహించాలని, మంచి నీటి క్లోరినేషన్ ప్రతిరోజు చేయించాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని, గ్రామంలోని వీధులను శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతిరోజు చెత్తను సేకరించాలని, వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు సేవలు అందించాలని పేర్కొన్నారు. సమయపాలన పాటించాలన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టి.పార్వతీ, ఈవోపీఆర్డీ పద్మజ పాల్గొన్నారు.


వీఏఏలకు శిక్షణ



మాట్లాడుతున్న కో–ఆర్డినేటర్, వ్యవసాయాధికారులు

రాజుపాలెం: మండలంలోని గణపవరం రైతు సేవా కేంద్రంలో క్రోసూరు సబ్ డివిజన్ వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని వ్యవసాయ సహాయకులకు శిక్షణ శనివారం నిర్వహించారు. శిక్షణలో జిల్లా శిక్షణా కోర్డినేటర్ ఎం.శివకుమారి మాట్లాడుతూ వరిలో చీడపీడల యాజమాన్యం పద్ధతుల గురించి వివరించారు. ఈ ప్రాంతంలో వరిలో ఆకుముడత, దోమపోటు ఎక్కువగా ఆశించే అవకాశం ఉన్నందున ఆర్థిక నష్ట పరిమితి స్థాయిని బట్టి దోమ నివారణకు డైనోటేఫ్యూరాన్ లేదా బూప్రోఫెజిన్ లేదా ట్రిఫ్లూమెజోఫరిన్ వాడాలనన్నారు. ఆకుముడత నివారణకు, రబీ మొక్కజొన్నలో సమగ్ర పోషక యాజమాన్య విధనాలను వివరించారు. వివిధ పంటలలో వాడవల్సిన జీవన ఎరువులను తెలిపారు. ఉద్యాన శాఖాధికారి నవీన్ మాట్లాడుతూ మిరప పంటలో యాజమాన్య పద్ధతులు, ఉద్యానశాఖలో అమలవుతున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో రాజుపాలెం, బెల్లంకొండ, అచ్చంపేట, అమరావతి, క్రోసూరు మండలాల వ్యసాయాధికారులు పి.వెంకటనర్సయ్య, డి.కృష్ణయ్య, పొత్తూరి వెంకటేశ్వర్లు, షేక్ అహ్మద్, వి.వేణుగోపాల్, రైతుసేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

'పట్టభద్రుల' ఓటుకోసం 2055 దరఖాస్తులు



మాచర్ల రూరల్: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు నమోదుకు ఇప్పటి వరకు 2055 దరఖాస్తులు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ బత్తుల వాణి, ఎన్నికల డీటీ గుంటు రమణలు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 10, ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ పాసైన వారు మాత్రమే అర్హులని, వచ్చే నెల 6వ తేదీలోపు సంబంధిత కార్యాలయంలో కానీ, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు మాచర్ల పట్టణంలో ఆఫ్‌లైన్‌లో 96, ఆన్‌లైన్‌లో 487, రూరల్‌లో ఆఫ్‌లైన్‌లో 45, ఆన్‌లైన్ 287, వెల్దుర్తి ఆఫ్‌లైన్ 1, ఆన్‌లైన్ 213, దుర్గి ఆఫ్‌లైన్ 12, ఆన్‌లైన్ 274, రెంటచింతల ఆఫ్‌లైన్ 8, ఆన్‌లైన్ 302, కారంపూడి ఆఫ్‌లైన్‌లో 12, ఆన్‌లైన్‌లో 318 అప్లికేషన్‌లు వచ్చాయన్నారు. అర్హత ఉండి దరఖాస్తు చేసుకోవాలనుకునేవారు డిగ్రీ సర్టిఫికెట్ పై గెజిటెడ్ ఆఫీసర్ సంతకాన్ని అటెస్టెడ్ చేయించి అప్లయి చేసుకోవాలని వారు కోరారు.